సాక్షి
ఆదిలాబాద్

మంగళవారం । 21 । మార్చి । 2023



గ్రామాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి

గిరిజన యువత గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. 8లో▸



పత్తి నిల్వతో ఇక్కట్లు..

పత్తి సాగు చేసిన రైతుల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోంది. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలేక దిగుబడిని ఇంట్లోనే నిల్వ ఉంచడంతో ఇక్కట్లు తప్పడం లేదు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.0/20.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

క్రమబద్ధీకరించాలని వినతి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్‌అర్బన్: సీఎం హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని, అప్పటివరకు పేస్కేల్ అమలు చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్ రాహుల్‌రాజ్, డీఈవో ప్రణీతకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమగ్ర శిక్షలో వివిధ విభాగాల్లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న వారందరినీ క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు అనురాధ, వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ దీప్తి, ప్రధాన కార్యదర్శి రవీందర్, ఉపాధ్యక్షుడు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

24న పెన్షనర్స్ జిల్లా మహాసభలు

ఎదులాపురం: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ 3వ జిల్లా మహాసభలను ఈ నెల 24న జిల్లా కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శశికాంత్, బాపురావు ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రంగయ్య, డిప్యూటీ సెక్రెటరీ సీతారాం తదితరులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. జిల్లా సభ్యులంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎండీటీతో కుష్ఠుకు పూర్తి చికిత్స



లక్ష్మీపూర్‌లో బాధితురాలికి కిట్ అందిస్తూ..

జైనథ్: ఎండీటీ చికిత్సతో కుష్ఠు ఏ దశలో ఉన్నా నయం అవుతుందని అదనపు డీఎంహెచ్‌వో శ్రీకాంత్ అన్నారు. మండలంలోని దీపాయిగూడ, లక్ష్మీపూర్ గ్రామాల్లో కుష్ఠుపై సోమవారం అవగాహన శిబిరాలు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు స్వీయ రక్షణ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరీరంపై పాలిపోయిన, రాగి రంగు మచ్చలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కుష్ఠును ప్రాథమిక దశలో గుర్తిస్తే జరిగే నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నైనత, డిప్యూటీ పారామెడికల్ అధికారులు వామన్‌రావు, మధుసూదన్ రాజ్, రమణాచారి, సూపర్‌వైజర్లు సుశీల, వేణు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 843 మంది గైర్హాజరు

కైలాస్‌నగర్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ప్రథమ సంవత్సరం గణితం, బాటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించగా 843 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో రవీందర్‌కుమార్ తెలిపారు. జనరల్ విభాగంలో 9,682 మందికి గాను 674 మంది గైర్హాజరు కాగా, 9008 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1206కు గాను 1,037 మంది హాజరైనట్లు వివరించారు.

రెండు రోజులపాటు శనగ కొనుగోళ్లకు బ్రేక్

కైలాస్‌నగర్: అకాల వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఈనెల 21, 22 తేదీల్లో శనగ కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ గౌరి నాగేశ్వర్ ప్రకటనలో తెలిపారు. 23వ తేది నుంచి కొనుగోళ్లు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు. విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

మైనార్టీ యువతకు ఉచిత శిక్షణ

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని నిరుద్యోగ మైనార్టీ యువతకు ట్యాలీ అకౌంటింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 36 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం(గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు మించకుండా) ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఇంటర్మీడియెట్ విద్యార్హత సర్టిఫికెట్లతో ఈనెల 23న సాయంత్రం 5 గంటల్లోపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మున్సిపల్ బడ్జెట్.. రూ.55.60 కోట్లు

- కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం
- గతేడాదితో పోల్చితే రూ.5 కోట్లు పెంపు
- ఆదాయ వనరులు పెంచుకోవాలని కలెక్టర్ సూచన

మున్సిపల్ అంచనా ఆదాయ వివరాలు	(రూ.లక్షల్లో)
ఆస్తి పన్ను	1253.00
అసైన్డ్ రెవెన్యూ ఆదాయం	1283.00
పన్నేతర ఆదాయం	1564.63

మున్సిపల్ అంచనా వ్యయం వివరాలు	(రూ.లక్షల్లో)
ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలు	1200.00
పారిశుధ్యం, నీటి సరఫరా నిర్వహణ	535.30
విద్యుత్ చార్జీలు	75.00
పదిశాతం గ్రీన్ బడ్జెట్	439.76
ఇతర నిర్వహణ వ్యయం	393.70
ప్రజల సౌకర్యాల కల్పన, వార్డుల వారీగా అభివృద్ధి పనులకు కేటాయింపులు :	135.93



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.55.60 కోట్ల అంచనాతో రూపొందించిన బడ్జెట్‌కు మున్సిపల్ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ బడ్జెట్ ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్ రాహుల్‌రాజ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ హాజరయ్యారు. కమిషనర్ ఏ.శైలజ బడ్జెట్ అంచనాలు, అజెండాను చదివి వినిపించారు. 2023–24 సంవత్సరానికి సాధారణ నిధుల అంచనా ఆదాయం రూ.2847.63 లక్షలుగా ప్రతిపాదించగా, ప్లాన్, నాన్ ప్లాన్ గ్రాంట్స్ అంచనా ఆదాయం రూ.2675.00లక్షలుగా రూపొందించారు. అలాగే వ్యయం విషయానికి వస్తే సాధారణ నిధుల అంచనా వ్యయం రూ.2847.63లక్షలు, ప్లాన్, నాన్ ప్లాన్ గ్రాంట్ల కింద రూ.2675 లక్షలుగా ప్రతిపాదించారు. దీనికి కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం పలికింది. సమావేశంలో వైస్‌చైర్మన్ జహీర్ రంజానీ, కమిషనర్ ఏ.శైలజ, అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించుకోవాలి

మున్సిపల్ అర్థిక వనరులను పెంచుకునే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. ఈ వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించేలా ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో వస్తున్న సమస్యలను గుర్తించి లీకేజీలను సరిచేస్తున్నట్లు తెలిపారు. అనధికారికంగా ఆక్రమణకు గురైన మున్సిపల్ స్థలాలు, అనధికార లేఅవుట్లపై తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కుక్కల సమస్యను తీర్చేలా ప్రతి రోజు 16 కుక్కలకు శస్త్రచికిత్సలు చేస్తున్నట్లుగా వెల్లడించారు.

పట్టణాభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్..

మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధే లక్ష్యంగా రూపొందించిన బడ్జెట్‌కు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు. కలెక్టర్ సూచనలను పరిగణలోకి తీసుకుని సొంత ఆదాయం పెంచేదిశగా తగు చర్యలు చేపడుతామన్నారు. పన్నులను వందశాతం వసూలు చేయడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పట్టణంలోని అన్ని కాలనీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు.

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు..



సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- వారం లోగా పరిష్కరించాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ రాహుల్‌రాజ్
- గ్రీవెన్స్‌లో దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్, పోలీస్, రెవెన్యూ శాఖల్లోనే ప్రజావాణి అర్జీలు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని, వచ్చే వారం నాటికి వాటిని పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ రిజ్వాన్, ట్రెయినీ కలెక్టర్ శ్రీజతో కలిసి ఆయన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్జీలను సంబంధిత అధికారులకు అందజేస్తూ సత్వరం పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గత వారం వరకు సంబంధించిన అర్జీల్లో ఇంకా 834 వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రూప్స్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం జిల్లా గ్రంథాలయాన్ని 24 గంటలపాటు తెరచి ఉంచాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం వంటి వసతులు కల్పించాలని గ్రంథాలయ కార్యదర్శి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్టడీ సర్కిళ్లలో పోటీ పరీక్షల సన్నద్ధానికి వీలుగా సౌకర్యాలు కల్పించాలని సంక్షేమ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్ రాథోడ్, జెడ్పీ సీఈఓ గణపతి, డీపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాపూరావ్

బోథ్: మండలంలో వడగళ్ల వానకు చోటు చేసుకున్న పంట నష్టంను ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ రుక్మణ్‌సింగ్, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ లింబాజీ, సర్పంచ్ సురేందర్ తదితరులున్నారు.

రైతులను ఆదుకోవాలి



కనుగుట్టలో పంటను పరిశీలిస్తున్న బొర్రన్న

బోథ్: మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం పంట నష్టంపై సర్వే చేయించి బాధిత రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతులు ప్రభాకర్, సుదర్శన్, అశోక్, రమేశ్, ఊషన్న తదితరుఉన్నారు.

సీబీఐతో విచారణ జరిపించాలి



జిల్లా కేంద్రంలో నిరుద్యోగులతో కలిసి రాస్తారోకోలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్: టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై నిరుద్యోగులతో కలిసి జిల్లా కేంద్రంలో సోమవారం ఆందోళన చేపట్టారు. బీసీ స్టడీ సర్కిల్ సమీపంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నాడు నిరుద్యోగ యువత స్వరాష్ట్రం కోసం ఉద్యమిస్తే నేడు ఉద్యోగాల కోసం ఉద్యమించాల్సిన దుస్థితి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఏర్పడుతోందని మండిపడ్డారు. ఎంతోమంది నిరుద్యోగులు తమ కుటుంబాలకు దూరంగా ఉండి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతుంటే, ప్రశ్నపత్రాలు లీక్ అవ్వడం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మరోవైపు మంత్రి కేటీఆర్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై తనకేంటి సంబంధం అంటూ వ్యాఖ్యానించడం బాధ్యతా రాహిత్యమన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు క్రాంతికుమార్, విజయ్, నరేష్, కాంత, అనిత, అనూప్, ప్రశాంత్ తదితరులున్నారు.



ఇచ్చోడలో: దీక్షలో మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఇచ్చోడలో..

ఇచ్చోడ: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సోమవారం చేపట్టిన నిరసన దీక్షలో పాల్గొని మాట్లాడారు. ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మానాజీ, ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బాబారావు, మాధవ్ అమ్టె, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దశరథ్, బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజుయాదవ్, చంద్రశేఖర్, సూర్యకాంత్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాలకు తరలిరండి



మాట్లాడుతున్న యోగానంద సరస్వతి స్వామి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో ఈనెల 22న ఉగాది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామీజీ తెలిపారు. మఠంలో సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులతో కలిసి సోమవారం ఆయన మాట్లాడారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఏటా మాదిరిగానే బుధవారం ఉదయం 10 గంటలకు ఉగాది పచ్చడి, తొగరి గుడాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. సాయంత్రం చికిలి వెంకటేశ్వర శాస్త్రి ఆధ్వర్యంలో పంచాంగ పఠన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సనాతన హిందూ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు ప్రఫుల్ వజే మాట్లాడుతూ, కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి మాధవ్, కోశాధికారి సూర్యకాంత్, ఉపాధ్యక్షులు రవీందర్, శ్రీనివాస్, దేవన్న, సుభాష్ పాల్గొన్నారు.

ఆటల బడి..ఆగమాగం



- జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులను ఓ కోచ్ వేధింపులకు గురిచేశాడు. విషయాన్ని సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లడంతో విచారణ జరిపి అతడిని సస్పెండ్ చేశారు. పాఠశాల ఆవరణలోనే నివాసం ఉండడంతో విద్యార్థినులతో వెట్టిచాకిరీ చేయించిన ఘటనలు లేకపోలేదు.
- ఈ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అర్హత లేనివారితో బోధన అందిస్తుండగా విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయి. ఇద్దరు మాత్రమే స్కూల్ అసిస్టెంట్లు, మిగతా వారంతా ఎస్జీటీలే.



- వసతిగృహం చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో తరచూ విషసర్పాలు ఆవరణలోకి వస్తున్నాయి. వారం క్రితం పాము కలకలం రేపగా, ఆదివారం మధ్యాహ్న సమయంలో రెండు నాగు పాములు విద్యార్థులు పడుకునే గదిలోకి రావడంతో వారంతా భయంతో బయటకు పరుగు తీశారు.

ఆదిలాబాద్‌టౌన్: క్రీడా నైపుణ్యాలతో పాటు విద్యా ప్రమాణాలు పెంపొందించి విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన ఆ ఆటల బడి గాడి తప్పింది. క్రీడలతో ఆకట్టుకోవాల్సిన స్పోర్ట్స్‌స్కూల్ నిర్వహణ లేమితో కొట్టుమిట్టాడుతోంది. నాసిరకం భోజనం.. కొందరు గురువుల వేధింపులు.. ఇలా పలు ఘటనలతో తరచూ వివాదాల్లోకి ఎక్కుతుంది. విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన గురువులు వెకిలి చేష్టలతో వేధింపులకు పాల్పడుతున్నారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆ విద్యార్థినులు ఆవేదనకు గురవుతున్నారు. అండగా నిలవాల్సిన ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో పాఠశాల నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది. కారణాలేమైనా.. వివాదాస్పదంగా మారుతూ విద్యార్థుల భవిష్యత్‌పై ప్రభావం చూపుతోంది. ఇందుకు రాజకీయ జోక్యం సైతం కారణమవుతోందనే ఆరోపణలున్నాయి.

- నాసిరకం భోజనం.. విద్యార్థులపై తరచూ వేధింపులు
- కొరవడిన పర్యవేక్షణ
- అర్హతలేని వారితో విద్యాబోధన
- ఇష్టారాజ్యంగా స్పోర్ట్స్ స్కూల్ నిర్వహణ

అర్హతలేని వారితో బోధన..

స్పోర్ట్స్ స్కూల్‌లో ఉన్నత స్థాయి విద్యార్థులకు స్కూల్‌అసిస్టెంట్లు బోధించాల్సి ఉండగా ఎస్జీటీలతోనే నెట్టుకొస్తున్నారు. పాఠశాలలో 5 నుంచి 10 తరగతి వరకు ఉండగా 186 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 93 మంది బాలికలు, 93 మంది బాలురు. మొత్తం ఏడుగురు ఉపాధ్యాయులు ఉండగా ఇద్దరు తెలుగు, ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లు. మిగతా వారందరు ఎస్జీటీలే. వీరంతా డిప్యూటేషనపైనే పనిచేస్తున్నారు. వారు పనిచేసే పాఠశాల దూరంగా ఉండటంతో పైరవీలతో ఇక్కడికి వచ్చారు. పదో తరగతి విద్యార్థులకు ఇక్కడ నామ్‌కే వాస్తేగా బోధన సాగుతుందనే ఆరోపణలున్నాయి. ప్రిన్సిపాల్‌తో సహా అందరు డిప్యూటేషన్‌పైనే ఉన్నారు. ఇదివరకు విద్యాబోధన చేసిన ఓ ఎస్జీటీ ప్రస్తుతం ఇదే పాఠశాలలో బ్యాడ్మింటన్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఉట్నూర్ ప్రాంతంలో పీఈటీగా పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు ఇక్కడ కేర్ టేకర్‌గా ఉన్నారు. దీంతో వారు పనిచేయాల్సిన పాఠశాల విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది.

వేధిస్తున్న కోచ్‌ల కొరత..

జిల్లా స్పోర్ట్స్ పాఠశాలలో కోచ్‌ల కొరత కూడా వేధిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో మాత్రమే క్రీడా పాఠశాలలు ఉన్నాయి. వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. బాక్సింగ్, జూడో, అథ్లెటిక్స్ కోచ్‌లు ఉండగా, వీరిలో అథ్లెటిక్స్ కోచ్ విద్యార్థులపై వేధింపులకు పాల్పడినట్లు తేలడంతో కలెక్టర్ ఇటీవల సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఇద్దరు కోచ్‌లు మాత్రమే ఉన్నారు. అలాగే ఓ ఎస్జీటీ బ్యాడ్మింటన్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. జాతీయస్థాయి పోటీలకు పంపించి పాఠశాల పేరును నిలబెట్టాల్సి ఉండగా, కోచ్‌లు లేకపోవడంతో అడపదడపా మాత్రమే పతకాలు వస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. హాకీ, స్విమ్మింగ్, ఫుట్‌బాల్, కబడ్డీ తదితర క్రీడలు ఆడించడం లేదు. కేవలం వ్యక్తిగత క్రీడల్లో మాత్రమే శిక్షణ ఇస్తున్నారు.

అంతా ఇష్టారాజ్యం..

క్రీడా పాఠశాలలో కేర్ టేకర్లు నివాసం ఉండేలా ఓ భవనంలో రెండు గదులను కేటాయించారు. అయితే ఈ భవనంలో మాత్రం కోచ్‌లు ఉంటున్నారు. కోచ్‌గా పనిచేస్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి హెచ్ఆర్ఏ అందుతున్నా ఆయన ఇక్కడ నివాసం ఉండడం గమనార్హం. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. సీజనల్ మేరకు పండ్లు ఇవ్వాల్సి ఉండగా, వీటి జాడ లేకుండా పోయింది. పాఠశాలలో ఇద్దరు కేర్ టేకర్లు ఉన్నారు. అయితే వీరిలో బాలికల కోసం కేటాయించిన మహిళా సిబ్బంది ఏఎస్‌ఎంగా ఉండగా, ఆమెకే కేర్‌టేకర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. బాలుర కోసం మరొకరు ఉన్నారు. వీరికి రిలీవర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వీరు లేని సమయంలో కొందరు బాలురు గోడ దూకి రాత్రి వేళల్లో బయటకు వెళ్తున్నట్లు ప్రచారం ఉంది. ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు చేపడితే తప్పా ఈ బడి గాడిలో పడేలా కనిపించడం లేదని తెలుస్తోంది.

విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం

స్పోర్ట్స్ పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నాం. ఇద్దరు విద్యార్థినుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి సదరు కోచ్‌పై సస్పెన్షన్ వేటు వేశాం. నాణ్యమైన విద్యాబోధనతో పాటు మెనూ ప్రకారం భోజనం అందేలా చూస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో

క్లుప్తంగా

పోస్టల్ ద్వారా రాములోరి తలంబ్రాలు

ఆదిలాబాద్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాద్రిలో శ్రీ సీతారామ కల్యాణానికి వినియోగించే తలంబ్రాలను పోస్టల్ ద్వారా అందజేస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వర రావు ప్రకటనలో పేర్కొన్నారు. స్పీడ్‌పోస్ట్ ద్వారా 10 గ్రాముల తలంబ్రాలు, 2 ముత్యాలు, పసుపు, కుంకుమ, మిశ్రి, 80 గ్రాముల కాజు ప్రసాదం ఇంటి వద్దకే డెలివరీ చేస్తారన్నారు. అదేవిధంగా రూ.150 చెల్లిస్తే 20 గ్రాముల కల్యాణ తలంబ్రాలు, రెండు ముత్యాలు అందిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పోస్టాఫీస్‌లో రూ.450 చెల్లించి ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. ఇందు కోసం https://eshop.tsposts.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 28వ తేదీ వరకు బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూచిపూడి నృత్యప్రదర్శనలో ప్రతిభ



అవార్డు అందుకుంటున్న హరిణి

కుంటాల: మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయులు తోట హరీష్–శైలజ కుమార్తె హరిణి కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబర్చింది. ఉగాది పర్వదినం పురస్కరించుకుని హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఆదివారం రవిశ్రీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రవీందర్, మాజీ ఐఏఎస్ అధికారి చింతల శ్రీనివాస్‌లు ఆమెకు అవార్డు అందజేశారు. నృత్య నాట్య అకాడమీ గురువు ఏలేటి అంజలి, పలువురు విద్యార్థినిని అభినందించారు.

జెడ్పీ పాఠశాల సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు చంద్రశేఖర్‌రెడ్డి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలను పదో తరగతి నిర్వహణ రాష్ట్ర పరిశీలకుడు చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం సందర్శించారు. వచ్చేనెల 3 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలపై ఉపాధ్యాయులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రీఫైనల్–2 పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి చదువులో వెనుకబడిన వారిపై శ్రద్ధ పెట్టాలన్నారు. జిల్లా అధికారులు నర్సయ్య, అశోక్, ప్రతాప్, హెచ్ఎం గోపాల్‌సింగ్ తిలావత్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మిస్సింగ్ కేసు

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన ఆశ్రనాజ్ (19) అనే యువతి కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఆదివారం రాత్రి నుంచి కనిపించకపోవడం లేదని యువతి అన్నయ్య షేక్ తబ్రేజ్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ పేర్కొన్నారు.

‘ప్రత్యేక’ పర్యవేక్షణ ఏది?



ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

- ఆశ్రమ గిరిజన పాఠశాలల్లో కేఏటీ అమలు
- ప్రతిరోజు సబ్జెక్టుల వారీగా టెస్టు
- కొన్నిచోట్ల అధికారుల పర్యవేక్షణ కరువు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదిలో వందశాతం లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. పాఠశాలల్లో 2022 డిసెంబర్ 1 నుంచి సబ్జెక్టుల వారీగా నాలెడ్జ్ అసైస్‌మెంట్ టెస్టు (కేఏటీ)ను అమలు చేస్తున్నారు. ఈ టెస్టు ప్రతిరోజు సబ్జెక్టు వారీగా నిర్వహిస్తారు. టెస్టుకు ముందు రోజు సంబంధిత ఉపాధ్యాయుడు విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. అలాగే విద్యార్థులకు వివిధ సామగ్రిని సైతం ఐటీడీఏ ద్వారా సరఫరా చేసింది. కేఏటీ సక్రమంగా కొనసాగుతుందో లేదోనని, టీ, స్నాక్స్, బిస్కెట్స్ సక్రమంగా అందుతున్నాయో లేదోనని పర్యవేక్షణ కోసం ఐటీడీఏ ఉన్నతాధికారులు ప్రత్యేక అధికారులను నియమించారు. ఇందులో సంబంధిత డివిజన్ ఏటీడీవో, ఏసీఎంవో, డీఎస్‌వో స్థాయి అధికారులు ఉన్నారు.

జిల్లాలో..
జిల్లాలోని 48 ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 1,700 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలల్లో సబ్జెక్టు వారీగా ప్రతి రోజు టెస్టులు నిర్వహిస్తున్నారు. అవి సక్రమంగా కొనసాగుతున్నాయోలేదోనని ప్రత్యేక అధికారులు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల సమయంలో పర్యవేక్షణ చేయాలి. కాని కొన్ని డివిజన్లలో పర్యవేక్షణ చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పలు సబ్జెక్టులపై దృష్టి
విద్యార్థులు సోషల్, సైన్స్, ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఇందుకుగాను అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతి అనంతరం ఏం చదవాలో వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయా సబ్జెక్టుల్లో పురోగతి ఎలా ఉందనే అంశాన్ని ప్రత్యేక అధికారులు పరిశీలించాలి. కాని జిల్లాలోని కొన్నిచోట్ల పర్యవేక్షణ కొనసాగడం లేదని తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం
విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించి అమలు చేస్తున్నాం. పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించాం. సాయంత్రం 5 నుంచి 7 గంటల ప్రాంతంలో వెళ్లి పర్యవేక్షించాలి. కొన్నిచోట్ల పర్యవేక్షణ జరగడం లేదనే విషయం తమ దృష్టికి రాలేదు. వారి పర్యవేక్షణ జరిగేలా చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ దిలీప్ కుమార్, డీడీ, గిరిజన సంక్షేమ శాఖ

‘కార్మికుల హక్కులు కాలరాస్తున్న కేంద్రం’



మాట్లాడుతున్న జనార్దన్

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు తొత్తు వ్యవహరిస్తోందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో సోమవారం నిర్వహించిన ఐఎఫ్‌టీయూ జిల్లా 8వ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. కార్మికుల హక్కులను కేంద్రం కాలరాస్తోందని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతుందన్నారు. శ్రమ దోపిడీకి గురవుతున్న బీడీ కార్మికులను ఆదుకోవాలని కోరారు. బీడీ, హాస్టల్ వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. ఓట్ల రాజకీయాలు చేస్తూ కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని అన్నారు. నాయకులు సునారికారి రాజేష్, భూక్య విలాస్, దుర్గం లింగన్న, లక్ష్మి, ఎం.హరిత, గోదావరి, కవిత పాల్గొన్నారు.

ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలి

- వరంగల్ లేబర్ జాయింట్ కమిషనర్ సునీత



ఈ–శ్రమ్ పత్రాలు అందజేస్తున్న సునీత

ఆదిలాబాద్‌రూరల్: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడి వివరాలను ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని వరంగల్ లేబర్ జాయింట్ కమిషనర్ సునీత అన్నారు. జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురికి ఉచితంగా ఈ–శ్రమ్‌లో పేర్లు నమోదు చేసి పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు అమలు చేసే వివిధ పథకాలను వినియోగించుకునేందుకు తప్పనిసరిగా ఈ శ్రమ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రావణి, అధికారులు వినోద్, రాజలింగు, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట అంధుడి నిరసన



తల్లితో కలిసి బైఠాయించిన అంధుడు రాజేశ్వర్

నిర్మల్‌చైన్‌గేట్: వికలాంగ సంక్షేమ శాఖ ద్వారా భర్తీ చేసే ఉద్యోగాలకు అన్ని అర్హతలు ఉన్న తనను ఎంపిక చేయాలని సారంగాపూర్ మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన రాజేశ్వర్ అంధుడు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపాడు. తన తల్లితో కలిసి బైఠాయించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగం కోసం పలుమార్లు కలెక్టర్లను కలిసి విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. తనకు న్యాయం జరిగే వరకూ పోరాడుతానని అన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరికి జైలు

నిర్మల్‌టౌన్: రెండు సెల్‌ఫోన్లు, టీవీ దొంగతనం చేసిన కేసులో ఇద్దరికి మూడునెలల జైలుశిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.500ల చొప్పున జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రథమ న్యాయమూర్తి ఆర్.అజయ్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విశ్వనాథ్‌పేట్‌లో నివాసముంటున్న రచర్ల చిన్నయ్య 2015, మే 25న తన తల్లిని ఇంట్లో ఉంచి బయటకు వెళ్లాడు. అదేరోజు రాత్రి గాజులపేట్‌కు చెందిన అన్నదమ్ములు మోతే కృష్ణ(30), మోతే రాజేందర్ (20)లు చిన్నయ్య ఇంట్లో చొరబడి రెండు సెల్ ఫోన్లు, టీవీని దొంగిలించారు. బాధితుడు ఫిర్యాదుతో అప్పటి ఎస్సై రమణమూర్తి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో ఇద్దరిని హాజరుపర్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ ఐదుగురి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు చేయడంతో ఈ మేరకు నిర్మల్ ప్రథమ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

సోలార్ బ్యాటరీల చోరీ




తానూరు: మండలంలోని భోసి గ్రామంలో రైతులు తమ పంటల రక్షణ కోసం ఏర్పాటుచేసిన సోలార్ బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. భోసి శివారు ప్రాంతంలో రైతులు మొక్కజొన్న, ఇతర పంటల రక్షణ కోసం సోలార్ సిస్టమ్ తీగలు ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 9 మంది రైతులకు సంబంధించిన సోలార్ బ్యాటరీలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై తెలిపారు. బాధిత రైతులు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

కోటపల్లి(చెన్నూర్): హత్య కేసులో మండలంలోని సర్వాయిపేటకు చెందిన నర్సనాయక్‌కు మంచిర్యాల జిల్లా కోర్టు సెషన్స్ జడ్జి బి.సత్తయ్య జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధించినట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు. చెన్నూర్‌కు చెందిన బెల్లంకొండ రాజ్‌కుమార్‌కు కోటపల్లి మండలంలోని సర్వాయిపేటకు చెందిన నర్సనాయక్ భార్యతో అక్రమ సంబంధం ఉందన్న అనుమానంతో 2018 జనవరి 15న అతన్ని హత్య చేయగా అప్పటి సీఐ కిషోర్, ఎస్సై వెంకన్న కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం తుది విచారణకు రాగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పులి రాజమల్లు కేసు వాదనలు వినిపించగా జడ్జి సత్తయ్య సదరు నిందితుడికి జీవిత ఖైదు విధించినట్లు సీఐ వివరించారు.

బాధితుడికి దాతల ఆర్థికసాయం

సాక్షి స్పందన



ఫోన్ పే ద్వారా నాగరాజు పంపిన రూ. 2 వేలు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేటకు చెందిన పాలాస రవి బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ అనంతరం ఖర్చులకు మరో రూ.2 లక్షలు అవసరమయ్యాయి. ఈ విషయమై ‘దాతలు సాయం అందించరూ’ శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు స్పందిస్తున్నారు. మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన నామెడ ధర్మరాజు రూ.10 వేలు, రంగపేటకు చెందిన ఎన్ఆర్ఐలు గడ్డం మనీశ్‌రెడ్డి రూ.5 వేలు, ఏలేటి రాజశేఖర్‌రెడ్డి రూ.5 వేలు, పట్టణానికి చెందిన ఒడ్డెటి నాగరాజు రూ.2 వేలు, మిగతా పలువురు రూ.వెయ్యి, రూ. 500 చొప్పున ఫోన్ పేకు పంపారని బాధిత కుటుంబీకులు తెలిపారు. సోమవారం దాతల నుంచి రూ.50 వేలు ఆర్థికసాయం అందాయని తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న కుమ్ర ఈశ్వరిబాయి

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి

నార్నూర్: పరీక్షల వేళ విద్యార్థుల ఆరోగ్యం, మెనూపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి అన్నారు. మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. డైనింగ్ హాల్, స్టోర్ రూంను పరిశీలించారు. స్టోర్‌లో కూరగాయలు చెడిపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా తీశారు. పోషకాహార లోపం వల్ల ఇలా జరిగిందని, నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌ను ఆదేశించారు. బాలికలకు సరిపడా వసతి గదులు లేదని, మరుగుదొడ్లు, నీటి సమస్య ఉందని విద్యార్థిని తమ దృష్టికి తీసుకువచ్చిందన్నారు. నూతన వసతి గృహం నిర్మాణంలో ఉన్నందున త్వరగా పూర్తి చేయించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌సీవో గంగాధర్‌ను ఫోన్‌లో ఆదేశించారు. విద్యార్థిని ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే శాఖపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీపీ కనక మోతుబాయి, మహిళా నాయకురాలు విద్యారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



రోగితో మాట్లాడుతున్న ఎస్పీ

సిరికొండ: గిరిజన యువత గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కన్నాపూర్‌లో ఎస్పీ ఆదేశాలతో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా ఎస్పీకి గిరిజన సంప్రదాయ పద్ధతిలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన యువత చదువులు మధ్యలో ఆపేయకుండా కొనసాగించాలన్నారు. బాగా చదివి తల్లిదండ్రులు, గ్రామానికి పేరు తీసుకురావాలన్నారు. ఈ శిబిరానికి సుమారు 20 గ్రామాల నుంచి 400 మంది హాజరుకాగా, రిమ్స్, ఉట్నూర్ పీహెచ్‌సీ వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. రోగులకు వైద్య చికిత్స అందించిన వైద్యులను ఎస్పీ అభినందించారు. ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, జెడ్పీటీసీ కుంరం చంద్రకళ, సర్పంచ్ కుంరం రఘురాం, సీఐలు నైలు, సైదారావు, ఎస్సైలు డి.సునీల్, నీరేష్, డాక్టర్లు దీపక్ పుష్కర్, వీణా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

‘సవాళ్లను ఎదుర్కొంటేనే విజయం’



మాట్లాడుతున్న ట్రైనర్ రాఘవేంద్ర



హాజరైన విద్యార్థులు

భైంసా: దైనందిన జీవితంలో సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకెళ్తేనే విజయం దరి చేరుతుందని ప్రముఖ ఇంగ్లిష్ ట్రైనర్, కౌన్సెలర్, కోచ్ రాఘవేంద్ర అన్నారు. బాసర ఆర్జీయూకేటీలో కెరీర్, ఇంటర్వ్యూ అనే అంశాలపై సోమవారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. డయల్ యువర్ విలేజ్ సంస్థ ద్వారా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌లో భాగంగా అవకాశాలు, సవాళ్లు అనే అంశాలపై వివరించారు. మెలకువలు, ఉపాధి అవకాశాలు, కోర్సులు, వాటి ప్రాధాన్యత, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ శ్రీ హరి బాబు, రవికాంత్, రాధాకృష్ణ, మోహన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

హత్యకు దారితీసిన గొడవ

- బంగారుగూడలో ఘటన
- కేసు నమోదు



రిజ్వాన్ మృతదేహం

ఆదిలాబాద్‌రూరల్: ఆ నలుగురు స్నేహితుల మధ్య జరిగిన గొడవ ఒకరి హత్యకు దారితీసింది. మండలంలోని బంగారుగూడలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై నాగనాథ్ కథనం ప్రకారం.. బంగారుగూడకు చెందిన మతీన్, ఫెరోజ్, అర్బాజ్, రిజ్వాన్‌లు స్నేహితులు. సోమవారం తలమడుగు మండలం ఖోడద్ గ్రామంలో విందుకు వెళ్లారు. అనంతరం ఈ నలుగురు బంగారుగూడకు చేరుకున్న తర్వాత వీరి మధ్య గొడవ జరిగింది. మతీన్, ఫెరోజ్, అర్బాజ్‌లు కలిసి రిజ్వాన్(25) అతని ఇంటి ముందు గొంతు నులిమి హత్య చేశారు. కాగా, కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూసి రిజ్వాన్ కిందపడిపోగా, చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రిజ్వాన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే ఫోన్ కోసం వీరి మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువతి మృతి

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ షాక్‌కు గురై మహారాష్ట్రకు చెందిన ఓ యువతి మృతి చెందినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని పాఠస్‌బోరికి చెందిన యూనుస్ పఠాన్ పెద్ద కుమార్తె సుమయ్య పఠాన్(17) ఈనెల 19న ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన ఇనుప తీగలపై బట్టలు ఆరబెడుతుండగా విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన కుటుంబీకులు పాఠస్‌బోరి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యుల సూచనలతో ఆదిలాబాద్ రిమ్స్‌కు రాత్రి 11.35 గంటలకు చేరుకున్నారు. కాగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కారు ఢీకొని ట్రక్ డ్రైవర్ మృతి

భైంసాటౌన్: కారు ఢీకొని ట్రక్ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన భైంసాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని హథ్‌గాం తాలూకా పలాస్‌వాడీతండా గ్రామానికి చెందిన బాలు పవార్(30) అనే ట్రక్ డ్రైవర్ సోమవారం సిమెంట్ లోడ్‌తో మంచిర్యాల జిల్లా దేవాపూర్ భైంసా మీదుగా నాందేడ్ వెళ్తున్నాడు. ఉదయం 6 గంటల ప్రాంతంలో భైంసాలోని ఎస్ఎస్ కాటన్ సమీపంలో లారీ నిలిపి టైర్లను చెక్ చేస్తున్నాడు. ఈ క్రమంలో నిర్మల్ వైపు నుంచి వచ్చిన స్విఫ్ట్ డిజైర్ కారు బాలును ఢీకొట్టి వెళ్లిపోయింది. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా కారును గుర్తించారు. మృతుడి తండ్రి సేవా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తానూరు: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై విక్రమ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తానూరుకు చెందిన కల్లూరు రాములు గ్రామ సమీపంలో జరిగిన విందు కార్యక్రమానికి వెళ్లి ఇంటికి నడుచుకుంటూ తిరిగి వస్తున్నాడు. తానూరు నుంచి బెల్‌తరోడాకు లక్ష్మణ్ బైక్‌పై అతివేగంగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెట్రోల్ బంక్ వద్ద రాములును ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రయాణికులు, స్థానికులు భైంసా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి పంపించారు.

ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



తొట్టిలో నీళ్లు పోస్తున్న అటవీశాఖ అధికారులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో సోమవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో పిచ్చుకల దాహం తీరడానికి అధికారులు నీటితొట్టెలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శరవణన్ మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి సునీల్ హిరేమత్, అటవీశాఖ రిటైర్డ్ అధికారులు బలయ్య, రాజారావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.